క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

గుర్రంపోడు : మండలంలోని తేనపల్లి గ్రామంలో శుక్రవారం కనకటి పర్వతాలు అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా తెగిపడిన వైరు తగలడంతో ప్రమాదం జరిగింది. ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని, తనకు నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు విద్యుత్ అధికారులను కోరాడు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న పోలీసు కళా బృందం

డిండి : మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారుల తప్పనసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు.అతివేగం ప్రమాదకరమనే పలు అంశాలపై కళాకారులు పాటల రూపంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇస్లాంపురంలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మిర్యాలగూడ టౌన్ : టీబీ ముక్త్‌భారత్‌లో భాగంగా శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్, బంగారుగడ్డ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఇస్లాంపురంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ 30ఏళ్ల దాటిన వారు పరీక్షలను నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ ఘనీ, డాక్టర్ నిపుణ్, నాగిరెడ్డి, ప్రమీల, వెంకన్న, అరుణ్, మంజులత, స్వర్ణ, కళ, రామశేషు, అంగన్‌వాడీ టీచర్లు కవిత, రహిదాబేగం, ఆర్‌పీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు ఇన్‌చార్జ్ ఎంపీఓగా సైదులు



నిడమనూరు : మండల ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారిగా ఏ సైదులు నియమితులయ్యారు. బంటువారిగూడెం గ్రామ కార్యదర్శి(గ్రేడ్-2)గా విధులు నిర్వహిస్తూ, ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి కేదార్‌నాథ్ డిప్యూటేషన్‌పై దామరచర్ల మండలానికి వెళ్లారు.

ఎస్ఆర్ కాలేజీ ఎదుట ఏబీవీపీ ఆందోళన

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని ఎస్ఆర్ కాలేజీలో కనీస మౌలిక సదుపాయాలు లేవని, బాలికల హాస్టల్ గదుల్లోకి అబ్బాయిలు వెళ్లి హంగామా చేసినా పట్టించుకోవడంలేదని కాలేజీ ఎదుట శుక్రవారం ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు ఆవుల సంపత్‌కుమార్ మాట్లాడారు. 9మంది విద్యార్థులు మాస్కులు ధరించి బాలికల హాస్టల్ గదుల్లోకి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారని, అయినా కాలేజీ యాజమాన్యం పట్టించుకోకుండా వ్యవహరిస్తుందని ఆరోపించారు. వెంటనే కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శంకర్, శివాజీ, శివ, మారుతీ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

నల్లగొండ టూటౌన్ : ప్రజలందరూ పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటి వాటిని కాపాడాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతీకాలనీలో మాజీ కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణం అందించాలంటే తప్పనిసరిగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు నేతి రఘుపతి, ఆంజనేయులు, వీరస్వామి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ ఇలా..నీరు పారేదెలా!

- పేరూర్ మైనర్ కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- చివరి ఆయకట్టుకు నీరు అందడం ప్రశ్నార్థకమే
- నీటిని వదిలే లోపు చెత్తను తొలగించాలంటున్న రైతులు


పేరూర్ కాల్వలో నిండిపోయిన చెత్తా చెదారం


అధ్వానంగా మారిన పేరూర్ ఎల్-1 మైనర్ కాల్వ

హాలియా : వానాకాలం సీజన్ ప్రారంభమైంది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే ఎడమ కాల్వ పరిధిలోని సాగు నీటి కాల్వలు ఆధ్వానంగా మారడంతో వానాకాలం సీజన్‌లో ఆయకట్టు భూములకు సాగు నీరందే పరిస్థితి ఏ మాత్రం కబడటం లేదు. ఎన్ఎస్పీ అధికారుల నిర్లక్ష్యంతో అనుముల మండలంలోని పేరూర్ ఎల్-1 మైనర్ కాల్వ దుస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ మైనర్ కాల్వ పరిధిలో సుమారు 600 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతి ఏటా సాగర్ ఎడమ కాల్వ ద్వారా పేరూర్ మైనర్ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నా ఆయకట్టు చివరి భూములకు మాత్రం నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం పేరూర్ మైనర్ కాలువలో పిచ్చి మొక్కలు, చెత్తచెదారంతో నిండిపోయింది. గత యాసంగిలో చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో మళ్లీ రైతుల్లో కలవరం మొదలైంది.

కాల్వలో వ్యర్థాలు

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పలు వర్తక, వ్యాపారులు, కోళ్ల ఫాం నిర్వాహకులు వ్యర్థపదార్థాలను పేరూర్ కాల్వలో పడేస్తున్నారు. ఈ వ్యర్థాలు తూముల వద్ద నీరు ప్రవహించకుండా అడ్డుకోవడం వల్ల చివరి భూములకు నీరందే పరిస్థితి లేకుండా పోయింది. అదే విధంగా కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వీటిని తొలగించడంలో ఎన్ఎస్పీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. చెత్తతో పాటు వ్యర్థాలు కాల్వలో వేయడం వల్ల నీరు విషతుల్యంగా మారుతుంది. రహదారి వెంటనే ఈ కాల్వలోని నీటిని తాగి మూగ జీవాలు అస్వస్థతకు గురవుతున్నాయి. అదే విధంగా తూము పటిష్టంగా లేకపోవడంతో వచ్చే కొద్దిపాటి నీరంతా వృథాగా పోతుంది. కాల్వలో చెత్తను వేయనీయకుండా చూడాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటి విడుదల లోపు కాల్వలో పేరుకుపోయిన పూడిక తీయడంతో పాటు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగిస్తే చివరి ఆయకట్టుకు నీరందే అవకాశ ముందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

చెత్త తొలగించాలి



పేరూర్ ఎల్-1 మైనర్ కాల్వ చెత్తతో పూడుకపోయింది. చివరి ఆయకట్టుకు నీరందక ప్రతి సంవత్సరం రైతులు సాగు చేసుకున్న పంటలు ఎండిపోతున్నాయి. హాలియా పట్టణానికి చెందిన పలువురు వ్యాపారస్తులు చెత్తచెదారం తీసుకొచ్చి కాలువలో వేయడంతో తూముల్లో ఇరుక్కొని నీరు సక్రమంగా ప్రహించక చివరి భూములకు నీరందడం లేదు. కాల్వలో పూడికతీత పనులు చేపట్టి తూములను బాగుచేయాలి.

– బొమ్మ సైదులు యాదవ్, రైతు, మదార్‌గూడెం

జెన్‌కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేసిన ఉద్యోగులు


డిప్యూటీ సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నాగార్జునసాగర్ : జెన్‌కో ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించానలి కోరుతూ శుక్రవారం నాగార్జునసాగర్‌కు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు 1104 యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆయనను బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. 1999నుంచి 2004సంవత్సరం లోపు విద్యుత్ శాఖలో చేరిన ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాలను జీపీఎఫ్ ఖాతాలుగా మార్చి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. జెన్‌కోలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగ కుటుంబాలకు తక్షణమే ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొన్నారు. నియామకాల్లో బీటెక్, డిప్లొమా ఉన్న వారికి సబ్ ఇంజనీర్లుగా ఉత్తర్వులివ్వాలని ఓఅండ్ఎమ్ ఉద్యోగుల్లో డిగ్రీ అర్హత ఉన్న వారికి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి జూనియర్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ చేయాలని కోరారు. ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ రూల్స్ అమలు పరిచి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఎస్ఎస్‌హెచ్ఈఎస్ నందు ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను ఆర్టిజన్ ఉద్యోగులకు అలాట్ మెంట్ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోజన్కో విభాగ కార్యనిర్వాహక అధ్యక్షులు రీజనల్ నాయకులు ఎం.యాసయ్య, బాలాజీ, గుప్తా, శ్రీనివాసులు, దేవుల, ప్రతాప్ గణేష్, రూప్‌సింగ్, లక్ష్మీనారాయణ, నాగరాజు ఉన్నారు.

మెనూ పాటించకుంటే కఠిన చర్యలు


వంటగదిని పరిశీలిస్తున్న పెద్దవూర ఎంఈఓ

నాగార్జునసాగర్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం సౌకర్యం కల్పించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దవూర ఎంఈఓ తరి రాము హెచ్చరించారు. శుక్రవారం హిల్‌కాలనీలోని మహాత్మాజ్యోతిబాపూలే వెనుకబడిన గురుకుల విద్యాలయం హాస్టల్‌లోని స్టోర్ రూమ్, వంటగదిని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం రుచికరమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. వంట గది శుభ్రంగా ఉంచడంతో పాటు వంట చేసేటప్పుడు పరిశుభ్రతను పాటించాలని తెలిపా రు. కూరగాయలు కోసే ముందు వాటిని ఉప్పునీటిలో కడుగాలని, వండిన పాత్రలు శుభ్రం చేయాలని తెలిపారు. స్టోర్ రూములో సరుకులను ఎలుకలు, జిర్రలు, పురుగులకు దూరంగా పరిశుభ్రమైన డబ్బాలలో పెట్టుకోవాలని సూచించారు. బియ్యం బస్తాలను స్టాండుపైననే పెట్టుకోవాలని, విద్యార్థులకు భోజనం వడ్డించే టప్పుడు హ్యాండ్ వాష్‌తో పాటు చేతులకు గ్లౌజ్‌లు ధరించాలన్నారు. రాములు వెంట ప్రిన్సిపాల్ రవికుమార్, డిప్యూటీ వార్డెన్ ఉన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం


మహిళా సంఘాల సభ్యులకు రుణాల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అధికారులు

మిర్యాలగూడ : రాష్ట్రంలోని మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్‌లో నియోజకవర్గంలో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి సంబరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు, సంఘాలకు సుమారు రూ.58.64కోట్ల వివిధ రకాల రుణాలు చెక్కును 4,197 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలోని మండలాల్లోని 568 సంఘాలకు సుమారు రూ.54.83కోట్లు, వడ్డీ రాయితీ కింద 3629 సంఘాలకు రూ.3.14కోట్ల రుణాల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి వై.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3911 సంఘాలకు రూ.181 కోట్లను లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసకోవాన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు శేషగిరిశర్మ, మాతంగి రమేష్, సరిత, జితేందర్‌రెడ్డి, డీపీఎం సోమయ్య, ఏపీడీ శ్రవణ్‌కుమార్, ఎస్.రామలింగయ్య, డీపీఎం రామలింగం తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టూటౌన్ : ఈ నెల 20న అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టోర్నమెంట్ పోస్టర్లను శుక్రవారం పట్టణంలో డీఈఓ భిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెస్ విద్యార్థుల మేదస్సుకు పదును పెడుతుందని సూచించారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సెక్రటరీ కొసనం కరుణాకర్‌రెడ్డి, చీఫ్ ఆర్బిటర్ మేడం విశ్వప్రసాద్, మేకల జాన్‌రెడ్డి, జిల్లా నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


చెస్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి


ఖిలా పార్క్‌లో మొక్క నాటుతున్న కమిషనర్

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ అన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని ఖిలా పార్కులో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో విరివిగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని కోరారు. అనంతరం వంద రోజుల ప్రణాళికలో భాగంగా 19వ వార్డులో డ్రై డే ఫ్రైడేపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మేనేజర్ రాకేష్, సక్రునాయక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

వరదకాల్వకు నీటిని విడుదల చేయాలి


మాడుగులపల్లి : వరదకాల్వలోకి దిగి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

మాడుగులపల్లి : ప్రభుత్వం వరదకాల్వకు నీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక వరదకాల్వలో రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు దేవిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో సరిపడా నీరు ఉన్నందున వరదకాల్వ ద్వారా మోటార్ల సాయందతో నీటిని విడుదల చేయాలని కోరారు. వరదకాల్వ కింద ఇప్పటికే రైతులు నార్లు వేసుకున్నారని నీరందకపోవడంతో ఎండిపోయే దశలో ఉన్నాయనప్నారు. వెంటనే వరదకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి కాల్వ కింద ఉన్న చివరి ఆయకట్టు వరకు చెరువులను, కుంటలను నింపి నార్లను రక్షించాలన్నారు. పదిరోజుల క్రితం ఖమ్మం జిల్లాకు సాగు, తాగునీటి పేరుతో అక్కడి మంత్రులు పాలేరు చెరువు నింపుకోవడానికి నీటిని తరలించారని ఆరోపించారు. వరదకాల్వలో మొలిచిన పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పుల్లెంల శ్రీకర్, లింగయ్య, రవి, శ్రీరాములు, కొండయ్య, ఎల్లయ్య, సైదిరెడ్డి, జానయ్య, కట్టా వెంకట్‌రెడ్డి, ఊర ఎల్లయ్య పాల్గొన్నారు.

త్రిపురారం : నాగార్జున సాగర్ ఎడమ కాలువకు తక్షణమే నీటి విడుదల చేసే విధంగా ప్రభుత్వం అధికారులను ఆదేశించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు కొప్పు వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో కొప్పు వెంకన్న మాట్లాడారు. సాగర్ ఆయకట్టు కింద రైతులందరు వరి నారు పోసుకున్నారని, సకాలంలో వర్షాలు కురవకపోవడవతో నారు మడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి సాగర్‌కు నీరు రావడం వల్ల ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి నారుమడులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు రైతులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ల సంక్షేమమే ధ్యేయం

రామగిరి(నల్లగొండ) : క్రిస్టియన్ల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సీఆర్ఐ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పాఠశాలలు, చర్చిలు, శ్మశానవాటికల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఉచితంగా సివిల్స్ కోచింగ్, విదేశి చదువులకు స్కాలర్ షిప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్స్ చేపడతామన్నారు. అనంతరం బిషప్ ధమస్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రెవరెండ్ పాదర్ అల్లారెడ్డి, పాదర్ బాల, బ్రదర్ ఇన్నా, పాస్టర్ క్రిష్టోఫర్, మోసెస్, పసల శౌరయ్య, పాదర్ వీజన్, బాలస్వామి, ధనరాజ్ రెడ్డి, జోసెఫ్, మరియమ్మ, ఆరోగ్యం, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతం


సామూహిక అనఘాష్టమి వ్రతంలో పాల్గొన్న భక్తులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రైల్వే కాలనీ శ్రీ సాయి దత్త ఆశ్రమంలో శుక్రవారం సాముహిక శ్రీ అనఘాష్టమి వ్రతాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యే పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జగన్నాథ రావు, సోమన్న, జానికిరాముడు, శ్రీనివాస బాబు, విక్రం, రవికిరణ్, అంజిబాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్

హాలియా : రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హాలియా పట్టణంలోని జరిగిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తక్షణమే ప్రభుత్వం విద్యారంగ సమస్యలు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యరంగా సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్, డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీశ్, సాయి, వర్షిత్, శివ, నరేష్, ఇమ్మనియాలు, నరేష్, బ్రమ్మి, నాగరాజు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు జరిమానా


ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ కృష్ణయ్య

మాడుగులపల్లి : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి పరిమితికి మించి రెండు ఆటోల్లో 30మంది ప్రయాణికులను ఎక్కించుకున్న ఇద్దరు ఆటో డ్రైవర్లకు శుక్రవారం ఎస్ఐ కృష్ణయ్య రూ.6వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నట్లయితే ఆ డ్రైవర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జవహర్‌లాల్

మిర్యాలగూడ : వర్షాకాలంలో విద్యార్థులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ బానోతు జవహర్‌లాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ), గిరిజన గురుకుల కళాశాలను ఆయన సందర్శించి పరిసరాలను, వంటగదిని పరిశీలించి మాట్లాడారు. వంటగది నుంచి వెళ్లే నీరు బయట మురుగుగా మారకుండా ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం వల్ల ఈగలు, దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, గ్రామ కార్యదర్శి వాసుదేవారెడ్డి, ఈసీ శంకర్, ప్రిన్సిపాల్ అరుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


డెస్క్ బెంచీలు, బ్యాగులు అందజేస్తున్న ఎస్ఐ మధు, దాత కరుణాకర్ రావు

గుర్రంపోడు : ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దాతలు అందజేస్తున్న సహకారం అభినందనీయమని ఎస్ఐ పసుపులేటి మధు అన్నారు. మండలంలోని బొల్లారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు వెల్గపూడి కరుణాకర్ రావు రూ.50వేల విలువైన డ్యూయల్ డెస్క్ బెంచీలు, స్కూల్ విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో మూతబడ్డ పాఠశాల తెరుచుకుని నేడు విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడంలో ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. మండల విద్యాధికారి నోముల యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు దాతల భాగస్వామ్యంలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెల్గపూరి రాంబాబు రావు, పాల్గొన్నారు.

ఇన్వర్టర్లను మూలనపడేశారు!


మున్సిపాలిటీలో నిరుపయోగంగా ఉన్న ఇన్వర్టర్లు

మిర్యాలగూడ టౌన్ : విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు కంప్యూటర్ సేవలకు అంతరాయం కలగకుండా మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో రూ.3లక్షల వ్యయంతో 16 బ్యాటరీలతో ఇన్వర్టరు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఏడాది కాలంగా ఆ ఇన్వర్టర్లు పనిచేయకపోవడంతో మూలన పడేశారు. దీంతో కరెంట్ పోయినప్పుడల్లా ఆస్తి, నీటి పన్నులు, ఇతర ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన ఆన్‌లైన్ చెల్లింపులకు ఇబ్బందులు తప్పడంలేదు. అయితే అవసరం లేకున్నా వీటిని కొనుగోలు చేసి లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇన్వర్టర్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే!


యల్లాపురంతండాలో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు


నెల్లికల్లులో చిత్తడిగా మారిన రహదారి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఉన్నాయి. చినుకు పడితే... చిత్తడే అన్న చందంగా మారాయి. దీంతో వర్షాకాలంలో గ్రామాల్లో వీధుల గుండా నడవాలంటే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందిన రోగాల బారిన పడుతామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.